ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

ఆదివారం 9 జూన్ 2024




ఉద్యానమా.. ఊపిరి పీల్చుకో..!

- బాబు మళ్లీ వచ్చారు.. ఆదుకుంటారు
- తోట పంటల రైతుల్లో ఎన్నెన్నో ఆశలు
- వైసీపీ పాలనలో పథకాల ఎత్తివేత
- సబ్సిడీ నిధుల నిలిపివేతతో
- ఉద్యాన రైతులకు తీవ్ర ఇబ్బందులు

వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ఉద్యాన రైతులు కష్టాలను ఎదుర్కొన్నారు. హార్టికల్చర్ డీలా పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యాన రైతులకు జగన్ మొండి చేయి చూపారు. టీడీపీ హయాంలో ప్రతి ఏటా ఉద్యాన రైతులకు పలు రకాల రాయితీలను అందించి ఆదుకున్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక రాయితీలను తగ్గించింది. రైతుల్లో కొందరికే లబ్ధి చేకూరింది. ఎక్కువ శాతం రైతులకు అన్యాయం జరిగింది. టీడీపీ హయాంతో పోలిస్తే వైసీపీ పాలనలో 50 శాతానికిపైగా నిధులను తగ్గించారు. ఐదేళ్లుగా అరకొరగా విధించిన టార్గెట్లకూ నిధులు సకాలంలో విడుదల చేయలేదు. దీంతో రైతులకు సరైన సమాధానం చెప్పలేక ఉద్యాన శాఖ అధికారులు తలలు పట్టుకున్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాలతో జిల్లాలో వేలాది మంది ఉద్యాన రైతులు సబ్సిడీ పథకాలకు దూరమయ్యారు. పంటలు సాగుచేయలేక నిస్సహాయ స్థితిని ఎదుర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎప్పుడు పోతుందా..? తమకు మంచి రోజులు ఎప్పుడు వస్తాయా అని నిరీక్షించారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో ఉద్యాన రైతులు ఇక తమ కష్టాలు తీరినట్టేనని ఊపిరి పీల్చుకుంటున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారీ అనంతను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో అందించిన సబ్సిడీలను పునరుద్ధరించి, హార్టికల్చర్‌కు పూర్వవైభవం తెస్తానని భరోసా ఇచ్చారు. ఆ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

- అనంతపురం అర్బన్/పుట్లూరు

స్టేట్ ప్లాన్ పథకాలు ఎత్తివేత



ఉద్యాన శాఖలో ఎక్కువ శాతం పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. టీడీపీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్టేట్ ప్లాన్ విడుదల చేసింది. పలు రకాల పథకాలను అమలు చేసింది. ఉమ్మడి జిల్లాకు స్టేట్ ప్లాన్ పథకాల కింద ఏడాదికి రూ.10 కోట్లకుపైగా నిధులు కేటాయించారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం రాయితీ వర్తింపజేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే స్టేట్ ప్లాన్ పథకాన్ని పూర్తిగా ఎత్తేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. స్టేట్ ప్లాన్ పథకం కింద పాలిహౌస్, ఫారం పాండ్స్, ప్యాక్ హౌస్, కూరగాయల పంటలకు పందిళ్లు ఏర్పాటు చేసుకునేందుకు యాభై శాతం సబ్సిడీ అందించేవారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం సబ్సిడీ అందించేవారు. ఇవి కొత్త తోటల విస్తరణకు, పాత తోటల పునరుద్ధరణకు ఉద్యాన రైతులకు ఎంతగానో తోడ్పడేవి. వైసీపీ ప్రభుత్వం వీటిని నిలిపేయడంతో రైతులు నష్టపోయారు.

అరకొర పథకాలపైనా అశ్రద్ధ

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యాన రైతులకు అందిందే అరకొర పథకాలు. వాటి అమలులోనూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ఆర్‌కేవీవై పథకం ద్వారా కలెక్షన్ సెంటర్లు, సోలార్ కోల్డ్ స్టోరేజ్ రూమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రతి ఏటా ఇచ్చిన అరకొరగా లక్ష్యాలను కూడా అధికారులు పూర్తి చేయలేకపోయారు. ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన) పథకంలో కొత్త పంటల విస్తీర్ణం పెంచాలి. రెండో సంవత్సరం నిర్వహణకు లక్ష్యం మేరకు నిధులు విడుదల చేయాలి. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంఐడీహెచ్ (మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్) పథకం ద్వారా మామిడి, జామ, చీనీ, దానిమ్మ, అరటి, బొప్పాయి తదితర పంటల విస్తీర్ణం పెంచాలి. కానీ పట్టించుకోలేదు. ప్లాస్టిక్ మల్చింగ్, ఫారం పాండ్స్, ప్యాక్ హౌస్, ఉద్యాన యాంత్రీకరణ తదితర పథకాలకు నిధులు మంజూరు చేయలేదు. ఎంపిక చేసిన రైతులు తమ వాటా డబ్బులు చెల్లించేందుకు సిద్ధమైనా.. ప్రభుత్వం నుంచి సబ్సిడీ సొమ్ము విడుదలలో జాప్యం చేశారు. దీంతో పథకాలు అమలుకు నోచుకోలేదు. టీడీపీ హయాంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. రైతు సంఘాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, ఇతర సదుపాయాలు కల్పించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు ఉత్పత్తి సంఘాలను గాలికి వదిలేసింది.





సబ్సిడీలు రాలేదు..

ఐదు ఎకరాల్లో చీనీ పంట సాగు చేస్తున్నాను. వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా సబ్సిడీ డబ్బులు రాలేదు. టీడీపీ హయాంలో కొత్త తోటల పథకం, పాత తోటల పునరుద్ధరణ, ఇతర రకాల పథకాలు అమలు చేశారు. ఉద్యాన రైతులకు సబ్సిడీలు వర్తింపజేసి ఆదుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్నింటినీ ఆపేశారు. సొంత డబ్బులతోనే తోటలో అన్ని రకాల పనులు చేసుకున్నాం. టీడీపీ కూటమి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- రవికుమార్‌రెడ్డి, గోపరాజుపల్లి, పుట్లూరు మండలం



నిధులు మంజూరు చేయాలి..

వైసీపీ హయాంలో ఉద్యాన రైతులకు చేసిందేమీ లేదు. నాలుగు ఎకరాల్లో అరటి పంట సాగు చేశాను. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి చేకూరలేదు. టీడీపీ హయాంలో పలు రకాల పథకాల ద్వారా సబ్సిడీలు వర్తింపజేసి చేయూతనిచ్చారు. చంద్రబాబు అధికారం చేపట్టాక ఉద్యాన పథకాలను తిరిగి అమలు చేయాలి. విరివిగా నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి.

- రవీంద్ర చౌదరి, చెర్లోపల్లి, పుట్లూరు మండలం

టీడీపీ హయాంలో ఉద్యాన పథకాల అమలు ఇలా..

సంవత్సరం	పథకాల అమలు (విస్తీర్ణం హెక్టార్లలో)	నిధులు (రూ.కోట్లలో)
2014- 15	49,624.99	2.97
2015- 16	1,00,310.13	9.34
2016- 17	40,964.76	8.24
2017- 18	5,322.58	9.66
2018- 19	5,261.31	10

వైసీపీ పాలనలో ఉద్యాన పథకాల అమలు తీరు..

సంవత్సరం	పథకాల అమలు (విస్తీర్ణం హెక్టార్లలో)	నిధులు (రూ.కోట్లలో)
2019- 20	2,804.03	4.17
2020- 21	2,062.61	5.25
2021- 22	2,594.05	6.77
2022- 23	4,001.4	3.62
2023- 24	2,209.98	2.94

తోటలకు ఊపిరిపోయాలి...



వైసీపీ పాలనలో హార్టికల్చర్‌ను పూర్తిగా విస్మరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అనంతను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్ది, తోట పంటలకు మళ్లీ ఊపిరిపోయాలి. టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైసీపీ పాలనలో ఉద్యాన రైతులకు భారీగా సబ్సిడీలు తగ్గించారు. టీడీపీ ప్రభుత్వంలో చిన్న, సన్నకారు ఉద్యాన రైతులకు ఆశించిన స్థాయిలో సబ్సిడీలు వర్తింపజేసి ఆదుకున్నారు. వైసీపీ పాలనలో ఉద్యాన రైతులకు మొండి చేయి చూపారు. పలు రకాల ఉద్యాన సబ్సిడీలు రద్దు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పాత పథకాలను టీడీపీ కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఉద్యాన రైతులను మరింతగా ప్రోత్సహించాలి.

- శివారెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి

రైతులకు అన్యాయం..



వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉద్యాన రైతులకు తీరని అన్యాయం చేశారు. టీడీపీ హయాంలో అందించిన పథకాలను రద్దు చేశారు. అరకొరగా అందించే సబ్సిడీలు కూడా ఆలస్యం చేశారు. ఉద్యాన శాఖకు బడ్జెట్‌ను పెంచి, కరువు జిల్లా రైతులకు చేయూతనివ్వాల్సిందిపోయి.. మొండిచేయి చూపారు. వైసీపీ పాలనపై ఉద్యాన రైతులు తీవ్ర అసంతృప్తిలో ఉండటంతోనే ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అనంతను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రత్యేక చొరవ చూపాలి. ఉద్యాన రైతులను ఆయన ఆదుకుంటారన్న నమ్మకం ఉంది.

- త్రిలోక్‌నాథ్‌నాయుడు, పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడండి

హెచ్చెల్సీ అధికారులకు ఎమ్మెల్యే కాలవ సూచన



నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

అనంతపురం అర్బన్, జూన్ 8: హెచ్చెల్సీ నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. నగరంలోని తన స్వగృహంలో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ రమణారెడ్డితో ఆయన శనివారం సమావేశమయ్యారు. తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ నాగులాపురం వద్ద బలహీనంగా మారిందని, అక్కడ తక్షణం మరమ్మతులు చేయాలని అన్నారు. హెచ్చెల్సీ పొడవునా అనేక వంతెనలు దెబ్బతిన్నాయని, దర్గాహోన్నూరు, గంగలాపురం, గరుడచేడు తదితర ప్రాంతాల్లో వంతెనలు కూలిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని అన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని హెచ్చెల్సీలో నీటి సరఫరాకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెలాఖరులో తుంగభద్ర జలాశయం నుంచి నీటి సరఫరా ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని, యుద్ధప్రాతిపదికగా మరమ్మతులు చేయాలని అన్నారు. కాలువలకు రెండు చోట్ల తక్షణ మరమ్మతుల కోసం రూ.60 లక్షలు అవసరమని అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామని కాలవ అన్నారు.

నిరీక్షణ ఫలించిన వేళ..!

- ఐదేళ్లుగా కాంట్రాక్టర్లకు అందని బిల్లులు
- టీడీపీ హయాంలో పనులు చేయడమే నేరం
- అధికార మార్పిడి కోసం వేచి చూసిన బాధితులు
- అభివృద్ధి పనుల బిల్లులు రూ.లక్షల్లో పెండింగ్
- కొత్త ప్రభుత్వం న్యాయం చేస్తుందని విశ్వాసం

గుంతకల్లు, జూన్ 8: ఐదేళ్ల కిందట చేసిన పనులకు కాంట్రాక్టర్లకు వైసీపీ పాలనలో బిల్లులు రాలేదు. వైసీపీ ఓటమి.. కూటమి ఘన విజయంతో తమ కష్టాలు తీరుతాయని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 వరకూ గుంతకల్లు మునిసిపాలిటీ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వివిధ రకాల పనులు చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పనుల బిల్లులన్నింటినీ అటకెక్కించేశారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని అనుకున్నా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులనైనా ఇవ్వాల్సింది. కానీ.. అవి కూడా విడుదల చేయకుండా కాంట్రాక్టర్లను అప్పుల్లో ముంచేశారు. ఇక ఎలాగూ వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించదని నిరుత్సాహానికి గురైన కాంట్రాక్టర్లు.. టీడీపీ గెలవకపోతుందా.. తమ బిల్లులు రాకపోతాయా అని ఆశతో ఎదురుచూశారు.

అమృత్ బిల్లులకూ దిక్కులేదు

టీడీపీ ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలలో తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్య పరిరక్షణ, సుందరీకరణ కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకం కింద గుంతకల్లు పట్టణంలో పైప్‌లైన్ల నిర్మాణం, పార్కుల ఏర్పాటు పనులను కేటాయించారు. పూర్తి అయిన పార్కులకు వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ పేరును పెట్టి.. ఆర్భాటంగా ప్రారంభించింది. పార్కులకు శిలాఫలకాలను ఏర్పాటు చేసుకున్నారుగాని, పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు చెల్లించలేదు. వైసీపీ అధికారం చేపట్టే నాటికి పార్కు పనులు 10 శాతం పెండింగ్ ఉన్నాయి. దీంతో ఆ మిగిలిన పనులను పూర్తిచేయాలని, బిల్లులు చెల్లిస్తామని అధికార పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. కానీ పనులు పూర్తి చేశాక మొండిచేయి చూపించారు.

ఇవన్నీ రావాలి..

కసాపురం రోడ్డులోని వైఎస్ఆర్ పార్కు పనులు చేసిన కాంట్రాక్టరు ఆనంద్‌కు దాదాపు రూ.15 లక్షలు చెల్లించాల్సి ఉంది. హంపయ్య కాలనీలో పార్కు పనులు చేసిన కాంట్రాక్టరు లింగప్పకు రూ.29 లక్షల బిల్లు బకాయి ఉంది. తాగునీటి పైప్‌లైన్ వర్కులు, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనుల బిల్లులు పెండింగులో ఉన్నాయి. అమృత్ పథకం కింద రోడ్లను తవ్వి, పైప్‌లైన్ వేసిన కాంట్రాక్టరు.. ధ్వంసమైన రోడ్డును ఈ స్కీం కిందనే పునర్నిర్మించాల్సి ఉంది. కానీ బిల్లులు ఇవ్వనందుకు తవ్విన రోడ్లను అలాగే వదలేశారు. ఈ పైప్‌లైన్ కారణంగానే కసాపురం రోడ్డు ధ్వంసమైపోయింది. మండీ బజార్‌లో తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. రాకపోకలు ఇబ్బందిగా మారడంతో స్థానిక వ్యాపారులు సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతు పనులు చేయించుకున్నారు. హంద్రీనీవాపై పంప్‌హౌస్ నిర్మాణ పనులు బిల్లులు రాని కారణంగా అర్ధంతరంగా నిలిచిపోయాయి.



బిల్లులు ఇవ్వని కారణంగా నిలిచిపోయిన పంప్ హౌస్

బిల్లులు పెండింగులో ఉన్న అమృత్ పార్కు



ఎస్సీ సబ్ ప్లాన్ బిల్లులు పెండింగ్

గుంతకల్లు పట్టణంలోని వివేకానంద పాఠశాల వద్ద ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అ పనులకు సంబంధించి రూ.7 లక్షలు కాంట్రాక్టరు అనిల్‌కు ఇవ్వాల్సి ఉంది. రాజేంద్ర నగర్‌లోని వెంకటేశ్వర ఆలయం వద్ద నిర్మించిన తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించి రూ.4 లక్షల బిల్లులు పెండింగులో ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండు వద్ద నిర్మించిన డివైడర్లకు సంబంధించిన పనులు పూర్తి చేసినా డిపాజిట్ సొమ్మును తిరిగి ఇవ్వలేదు. 60 అడుగుల రోడ్డులో వేసిన బటర్ ఫ్లై లైట్లకు సంబంధించి రూ.10 లక్షలు, కసాపురం రహదారిలో ఏర్పాటు చేసిన లైట్లకు రూ.8 లక్షలు, పాత గుంతకల్లు బీరప్ప దేవాలయం వద్ద లైటింగ్ వర్కుకు రూ.6 లక్షల బిల్లులు కాంట్రాక్టరుకు ఇవ్వలేదు. ఒకటిన్నర సంవత్సరం కిందట టీడీపీ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు కోర్టులో కేసు వేసి విజయం సాధించారు. నీరు-చెట్టు, రూరల్ రోడ్లకు సంబంధించి కొంతమేర బిల్లులను రాబట్టారు. అంతకు మించి ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఒక్క పైసా చెల్లించలేదు. జగన్ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులను అటకెక్కించింది. దీంతో ఎలాగూ బిల్లులు వచ్చే పరిస్థితి లేదనుకుని, కాంట్రాక్టర్లు టీడీపీ ప్రభుత్వం వచ్చేదాకా ఎదురుచూశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశాక తమ కష్టాలు తీరుతాయని కాంట్రాక్టర్లు విశ్వసిస్తున్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

ఎస్పీ గౌతమి శాలి హెచ్చరిక



అనంతపురం క్రైం, జూన్ 8: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే పోస్ట్ చేసిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌతమి శాలి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర సోషల్ మీడియాలో చాలా మంది రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఇళ్లను ముట్టడిస్తాం, దాడులు చేస్తామని బెదిరిస్తూ, తీవ్రమైన హెచ్చరికలు చేస్తూ పోస్టులు పెడుతున్నారని అన్నారు. వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఈ తరహా పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యులు ఏది పడితే అది పోస్ట్ చేయకుండా గ్రూప్ అడ్మిన్‌లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లేదంటే గ్రూప్ సభ్యులు చేసిన పోస్టులకు సైతం గ్రూప్ అడ్మిన్లే బాధ్యులవుతారని హెచ్చరించారు. రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు, తప్పుడు ప్రచారాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెచ్చగొట్టే పోస్టులు, ఫొటోలు, వీడియోలను షేర్ చేయడం, స్టేటస్‌లుగా పెట్టుకోవడం నిషిద్ధమని అన్నారు. ఈ విషయంలో గ్రూప్ అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అంటకాగిన వారిలో ఆందోళన

- బదిలీల కోసం తీవ్ర ప్రయత్నాలు
- ఐదేళ్లపాటు వైసీపీ సేవలో తరించారు
- భారీగా అక్రమార్జన.. రూ.కోట్లకు పడగలు
- అధికారం చేతులు మారడంతో గుబులు



కళ్యాణదుర్గం, జూన్ 8: కూటమి విజయంతో వైసీపీతో అంటకాగిన అధికారుల్లో గుబులు మొదలైంది. నియోజకవర్గంలోని వివిధ శాఖల్లో ఐదేళ్ల పాటు వైసీపీకి కొమ్ముకాసిన సుమారు 55 మంది అధికారులు తట్టాబుట్టా సర్దుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే బదిలీ ప్రయత్నాలను ప్రారంభించారు. వీరిలో మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు, ఎంపీడీఓ కార్యాలయాల అధికారులు, పంచాయతీ రాజ్ కార్యాలయ అధికారులు ఉన్నారు. వైసీపీ పాలనలో వీరందరూ ఆ పార్టీ నాయకులకు వంత పాడుతూ పబ్బం గడుపుకున్నారు. వైసీపీ ఘోర పరాజయంతో వారిలో ఆందోళన మొదలైంది. ఇక్కడే ఉంటే తప్పులు బయట పడతాయని, ఇబ్బందులు ఎదురవుతాయని ముందు జాగ్రత్తకు పోతున్నారు.

ఆర్ఐ అక్రమార్జన

కళ్యాణదుర్గం పట్టణంలో ఒక ఆర్ఐ వైసీపీ నాయకులతో అంటకాగారు. ఆ పార్టీ నాయకులు అడిగిందే తడవు.. రెవెన్యూ శాఖలో పనులన్నీ చక్కబెట్టేవారు. గడిచిన ఐదేళ్లలో ఆయన రూ.కోట్లు ఆర్జించారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమ సంపాదనతో భారీగా భూములను కొనుగోలు చేశారని సమాచారం. వైసీపీకి వీరవిధేయుడిగా పనిచేశారన్న విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ శాఖలో ఇప్పటికీ ఆయన పెత్తనం నడుస్తోందని సమాచారం.

ఒకరికి మించి ఒకరు..

- పంచాయతీ రాజ్ శాఖలో పనిచేసే ఓ కీలక అధికారి వైసీపీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయారు. కోట్లాది రూపాయలు అక్రమంగా ఆర్జించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పనులు చేయకపోయినా బిల్లులు డ్రాజేసి రూ.కోట్లలో వెనకేసుకున్నారని సమాచారం. పనులు, బిల్లుల విషయంలో ఆయన వైసీపీ నాయకులకు కల్పతరువుగా ఉండేవారని ప్రచారం ఉంది.
- ట్రాన్స్‌కోలో పనిచేసే ఓ కీలక అధికారి వైసీపీ నాయకులు ఏది చెబితే అది చేశారు. వారి అండతో ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరించారు. ట్రాన్స్‌కో కార్యాలయాల్లో ఇష్టానుసారంగా ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపణలు ఉన్నాయి. రూ.రెండు కోట్లకు పైగా అక్రమాలకు పాల్పడ్డారని బహిరంగ చర్చ జరుగుతోంది.
- మండల పరిషత్ కార్యాలయాలు, ఉపాధి హామీ పథకం పనుల్లో వైసీపీకి వీరవిధేయుడిగా పనిచేసిన అధికారులు ఇప్పటికీ హవా నడిపిస్తున్నారు.
- కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ వైద్యుడు వైసీపీ నాయకులు చెప్పిందల్లా చేస్తుంటారు. ఇప్పటికీ ఆయన కనుసన్నల్లోనే ప్రభుత్వాస్పత్రి నిర్వహణ సాగుతోంది.
- కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులు వైసీపీ నాయకులతో అంటకాగారు. నిబంధనలకు తిలోదకాలిచ్చారు. కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి కీలక అధికారులను డమ్మీలుగా మార్చారు. వైసీపీ నాయకుల అండతో రెచ్చిపోయారు. ఆ అధికారి చెప్పిందే శాసనం అన్నట్లుగా వ్యవహారాలు సాగాయి.
- పోలీసు శాఖలో కొందరు శాంతిభద్రతల పరిరక్షణకు కాకుండా, వైసీపీ నాయకులు చెప్పింది చేయడానికే ఉన్నట్లుగా వ్యవహరించారు. వైసీపీ ఓటమితో ఇక ఇక్కడే ఉంటే ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. బదిలీకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

వంకల్లో నీటినిల్వ లేకుండా చర్యలు

72 గంటల్లో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయండి

నగరపాలక అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూన్ 8: నగరంలో ఉన్న వంకల్లో ఎక్కడా వర్షం నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే దగ్గుబాటిప్రసాద్‌తోపాటు నగరపాలక అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షం వచ్చిన సమయంలో ఆ నీరు ఎక్కడికి పోతుంది..? ఏ ప్రాంతం ప్రభావితం అవుతోంది. ఎలాంటి ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారో తెలుసుకుని 72 గంటల్లో కార్యాచరణప్రణాళిక సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. మరువ వంకలు ఉన్న ప్రాంతాలను పరిశీలించి ఎక్కడా చెత్త ఉండకుండా వెంటనే తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రం చేయించడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ఈ కార్యాచరణను కమిషనర్ పర్యవేక్షించాలన్నారు. ఫోన్‌ఇన్ చేపట్టి ప్రజలనుంచి వచ్చే సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రతి ప్రాంతంలోను ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంబంధిత ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాలని, కంట్రోల్‌రూం నుంచి అధికారులు పర్యవేక్షించాలన్నారు. నగరపాలక అభివృద్ధికి అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని, తన వంతు సహకారం అందిస్తానని కలెక్టర్ తెలిపారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి
: ఎమ్మెల్యే దగ్గుబాటి

నగరంలోని నడిమివంక, మరువవంకలవద్ద పెద్దఎత్తున ఆక్రమణలు జరగడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ కలెక్టరు వినోద్ కుమార్, కమిషనర్ మేఘస్వరూప్‌లను కోరారు. వంకలు కిలోమీటర్ల మేర పోతుండడం వల్ల ఆ వెళ్లే ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం వల్ల నీరుబ్లాక్ అయి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పెద్దఎత్తున మొక్కల నాటేకార్యక్రమం చేపట్టి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, మున్సిపాల్ ఆర్డీ పీవీఎస్‌ఎస్ మూర్తి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈసురేంద్ర, పబ్లిక్ హెల్త్ డీఈ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పెద్దదిక్కును కోల్పోయాం : పరిటాల సునీత



రామోజీరావు కుటుంబ సభ్యులతో పరిటాల సునీత

అనంతపురం అర్బన్: రామోజీ గ్రూప్స్ అధినేత రామోజీరావు మరణం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని, వ్యక్తిగతంగా తమ కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయినట్లుందని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో ఆయన పార్థివ దేహానికి ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఆమె నివాళులు అర్పించారు. ఆయన పార్థివదేహాన్ని చూసి పరిటాల సునీత కంటతడిపెట్టారు.

టీడీపీ కార్యాలయంలో..



నివాళులు అర్పిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: రామోజీరావుకు శనివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్‌లు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఆలంనరసానాయుడు, గంజే నాగరాజు, గాజుల ఆదెన్న, సరిపూటి రమణ, విశాలాక్షి, సుధాకర్ యాదవ్, నెట్టెం బాలకృష్ణ, ఆవుల కృష్ణయ్య, బ్యాళ్లనాగేంద్ర, సుధాకర్ యాదవ్, కురుబ నారాయణస్వామి, దండు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ కార్యాలయంలో..



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో రామోజీరావుకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, పోతుల లక్ష్మీనరసింహులు, రాయల్ మురళీ, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

కమ్మసంఘం నాయకుల ఆధ్వర్యంలో..



నివాళులు అర్పిస్తున్న కమ్మసంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్: రామోజీరావుకు కమ్మ సంఘం నాయకులు కమ్మభవన్‌లో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సరిపూటి సూర్యనారాయణ, నెట్టెం నారాయణ, గోనుగుంట్ల శ్రీనివాసులు, తోపుదుర్తి వెంకటనారాయణ, గొర్తి వెంకటేశ్వర్లు, మందల శంకర్, గోనుగుంట్ల భాస్కర్, నెట్టెం వెంకటేష్, వెంకటప్ప, అనురాధ, ఆదినారాయణ, గోళ్ల సుధాకర్‌నాయుడు, ఆచార్య కొండ్రు సుధాకర్‌బాబు, ఆర్‌వీ నాయుడు, కోనంకి రామయ్య, నాగప్రసాద్ నాయుడు, ఇంజనీర్ సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలోని ఆంధ్రాభవన్‌లో అంబికా..



రామోజీరావుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జనసేన నాయకులు నివాళులు అర్పించారు. శనివారం ఢిల్లీలోని ఆంధ్రభవన్ వద్ద రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య పాల్గొన్నారు.



అనంతపురం టౌన్‌బ్యాంకు కార్యాలయంలో మౌనం పాటిస్తున్న జేఎల్ మురళీధర్



నగరంలోని మంగళవారి కాలనీలో నివాళులు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ రాజారావు

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాజీనామా

అనంతపురం విద్య, జూన్ 8: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పదవికి ఎల్‌ఎం ఉమాదేవి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు స్టేట్ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌కు తన రాజీనామా పత్రాన్ని పంపారు.

మార్కెట్‌యార్డులో తొలగిన అపరిశుభ్రత

ఆంధ్రజ్యోతికి స్పందన



అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయమార్కెట్ యార్డు శుభ్రమైంది. 'అపరిశుభ్రంగా మార్కెట్ యార్డు' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మార్కెట్‌యార్డును శుభ్రం చేశారు. ముఖ్యంగా చీనీ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న అపరిశుభ్రతను ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. ఎరువు, చెత్త కుప్పలను తొలగించారు.

ప్రకాష్‌రెడ్డి మీసం తీయించుకోవాలి

లేనిపక్షంలో ఇంటిని ముట్టడిస్తాం: టీడీపీ నాయకులు



వినతిపత్రం ఇచ్చేందుకు డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన నాయకులు

రాప్తాడు, జూన్ 8: తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మీసం తీయించుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఓ సమావేశంలో పరిటాల కుటుంబం గెలిస్తే మీసం గీయించుకుంటానని ఆయన సవాల్ విసిరాడని, ఆ మేరకు మీసం తీయించుకోవాలన్నారు. శనివారం రాప్తాడులో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ మునిస్వామికి వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మీసం తీయించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆదివారం సాయంత్రంలోగా రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయనిపక్షంలో సోమవారం ప్రకాష్‌రెడ్డి ఇంటిని ముట్టడి చేస్తామన్నారు. ప్రకాష్‌రెడ్డి మాట మీద నిలబడనందున శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సైన్యం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏపీ ముత్యాలు, రాప్తాడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముత్యాలప్ప, నాయకులు కదిరప్ప, నరేష్, లక్ష్మన్న, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 8: త్వరలో విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయా వసతిగృహాల్లో విధులు నిర్వహించే వర్కర్లకు ఎస్సీ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావ్ ఆదేశించారు. శనివారం బీసీ స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని వసతిగృహాల వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే వార్డెన్ల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్లు అన్వర్, వెంకటలక్ష్మి, ఎస్సీ హాస్టల్స్ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పయ్య పాల్గొన్నారు.

ఘర్షణలకు దిగితే చర్యలు: సీఐ

నార్పల, జూన్ 8: ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవని సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం వీఆర్వోలు, మహిళా పోలీసులు, మండలంలోని వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సంయమనంతో మెలగాలన్నారు. .

చిన్నారి వైద్యానికి అమ్మ సంస్థ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, జూన్ 8: బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న 3 నెలల చిన్నారి వైద్యంకోసం చేయూతనందించింది అమ్మ సంస్థ. స్థానిక 2వ రోడ్డులో నివాసముంటున్న దుర్గాప్రసాద్, ప్రీతి దంపతులు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 3 నెలల చిన్నారి ఉంది. పాపకు ఆరోగ్యం సరిగా ఉండకపోవడంతో డాక్టర్‌కుచూపించగా బ్లడ్‌లో ఇన్‌ఫెక్షన్ ఉందని, బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న వారు అమ్మ సంస్థను ఆశ్రయించగా ఆ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆ కుటుంబానికి రూ. 75 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో సైతం సహాయసహకారాలు అందజేస్తామని అన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

అనంతపురం రూరల్ జూన్ 8: మండలంలోని కురుగుంట పంచాయతీ వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న హరి అనే కార్యకర్త అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రైతు సంఘం రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు మారినేని నారాయణస్వామి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబానికి తనవంతుగా రూ. 5వేలు ఆర్థిక సాయం అందచేశారు.

పోలీస్ స్టేషన్‌లో పాము



పామును పట్టుకున్న రాజు

శింగనమల జూన్ 8: శింగనమల పోలీసు స్టేషన్‌లో పాము హల్‌చల్ చేసింది. శనివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌లోకి పాము దూరడంతో పోలీసులు ఒకసారిగా భయాందోళనకు గురయ్యారు. స్నేక్‌క్యాచర్ రాజుకు సమాచారం అందించడంతో ఆయన పామును పట్టుకుని నిర్మానుష్యప్రాంతంలో వదిలిపెట్టారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన కోటంక నాయకులు



వెంకటశివుడు యాదవ్‌ను సన్మానించిన కోటంక తెలుగుయువత నాయకులు

గార్లదిన్నె, జూన్ 8: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌ను అనంతపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు ఆవులక్రిష్ణయ్య, బీసీ నాగేంద్ర, కోటంక సర్పంచు ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, చెరుకూరి శివశంకర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

'పోలీసులపై చర్యలు తీసుకోవాలి'



టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న నాయకులు

శింగనమల జూన్ 8: సలకంచెరువు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులను చితకబాదిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మండల నాయకులు డిమాండ్ చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేశారంటూ నలుగురు టీడీపీ కార్యకర్తలను పోలీసులు చితకబాదారు. ఇందులో తిరుపాలుకు తీవ్రగాయాలయ్యాయి. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, మారుతి నాయుడు, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, రాఘవరెడ్డి, చింతబరిదొర, ఈశ్వర్‌రెడ్డి, చిదానందనాయుడు, మాసూలచంద్ర, గుర్రం లక్ష్మీనారాయణ, నాయకులు కార్యకర్తలు పరామర్శించారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ దుర్మరణం



అమర్నాథ్(ఫైల్)

గార్లదిన్నె, జూన్ 8: మండల పరిధిలోని కల్లూరు అగ్రహారం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఓ అమర్నాథ్ (36) దుర్మరణం చెందారు. గార్లదిన్నె మండలం కమలాపురం గ్రామానికి చెందిన అమర్నాథ్ పామిడి మండలం కత్రిమల వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో పామిడికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కల్లూరు అగ్రహారం వద్ద బొలెరో ఢీకొంది. ప్రమాదంలో వీఆర్‌ఓ అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోండి

శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

రామగిరి, జూన్ 8: గ్రామాలను ఐకమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని కుంటిమద్ది, పోలేపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గొడవలు చేసుకోరాదని ప్రజాశాంతికి భంగం కలిగించరాదని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసంచేయడం వంటివి చేస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో గొడవలకు దిగకుండా ప్రశాంతంగా జీవించాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని ప్యాదిండి గ్రామాన్ని సందర్శించి గ్రామసభ నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటుచేయడంతోపాటు మొబైల్ పార్టీలు గస్తీ తిరుగుతున్నాయన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ శ్రీవిష్ణు, సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ వేంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ ఎస్పీ వెంట ఉన్నారు.

రామోజీరావుకు ఘననివాళి



● బుక్కరాయసముద్రంలో నివాళులు అర్పిస్తున్న మండల కన్వీనర్ అశోక్, నాయకులు పొడరాళ్ల రవీంద్ర, ఎస్ నారాయణస్వామి, లక్ష్మీనారాయణ



● నార్పలలో నివాళులు అర్పిస్తున్న ఆలం వెంకటనరసానాయుడు, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, నాయకులు ప్రతాప్‌చౌదరి, ఆలం నాగార్జున నాయుడు



● రామగిరిలో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు నివాళి



● చెన్నేకొత్తపల్లిలో మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి నాయకులు అంకేలమరేంద్ర, మాడెం సూర్యనారాయణ రెడ్డి, గార్లదిన్నె భాస్కర్ నివాళి



● అనంతపురం పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో బీసీసెల్ ఉపాధ్యక్షుడు కనుమ చౌదయ్య, వాల్మీకి బోయ సాధికారత రాష్ట్ర డైరెక్టర్ మణిరవి, పూజారిగోపాల్ నివాళి



● గార్లదిన్నెలో నివాళులు అర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, నాయకులు గుత్తాబాలకృష్ణ, రామచంద్ర, కొడిదల రామకృష్ణ, శేఖర్, గుర్రం శీనా, రామాంజి, కొడిదల శీనా



● రాప్తాడులో నివాళులు అర్పిస్తున్న మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, సర్పంచ్ తిరుపాలు



● శింగనమలలో టీడీపీ నాయకులు



● ఆత్మకూరులో నివాళులు అర్పిస్తున్న మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల నాయకులు శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణ, సుబ్బరహరి, రవీంద్రారెడ్డి



● కమ్మభవన్‌లో జరిగిన సంతాపసభలో నివాళులు అర్పిస్తున్న, విశ్రాంత రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, కమ్మభవన్ కమిటీ సభ్యులు నాయుడు, శ్రీనివాసులు, నారాయణ, ధనుంజయ, వెంకటనారాయణ



● నగరంలోని శ్రీనగర్ కాలనీ మైత్రివనం సర్కిల్‌లో ఉపాధ్యాయులు మంజునాథ్, కోనంకి అశోక్‌కుమార్, గంధం శ్రీనివాసులు, వెంకటరాముడు తదితరుల నివాళి



ఆలయంలో న్యాయాధికారి, కుటుంబ సభ్యులు

ఆంజనేయస్వామి సన్నిధిలో విశాఖ న్యాయాధికారి

నల్లచెరువు, జూన్ 8: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయాన్ని విశాఖపట్నం సివిల్ కోర్టు సీనియర్ న్యాయాధికారి వెంకటేశ్వర రావు శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆయన్ని శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. గతంలో కదిరి కోర్టులో పని చేసినట్లు ఆయన తెలిపారు. భక్తులు కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

'విద్యాకానుక' పై సమగ్ర విచారణ చేయాలి

అనంతపురం విద్య, జూన్ 8 : పాఠశాలలకు ఈ ఏడాది సరఫరా చేసే విద్యాకానుక కిట్లలో రూ. 150 కోట్ల దోపిడీ జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనిపై సమగ్రమైన విచారణ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కానుక కిట్లను టెండర్ నిర్వహించకుండానే కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్దతిలో రూ. 772 కోట్ల సామాగ్రిని సరఫరా చేసే బాధ్యతలు అప్పగించారన్నారు. దీన్ని ప్రజాసంఘాల నాయకులు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకంటే అధనంగా 9.31 లక్షల మందికి కిట్లు కొనుగోలు చేసినట్లు విమర్శలు వస్తున్నాయన్నారు. నోట్ పుస్తకాల్లో నాణ్యత లోపించడం, 2023-24 విద్యా ఏడాదిలో సరఫరా చేసిన బ్యాగులు నాణ్యత లేవదన్న ఆరోపణలు వచ్చాయన్నారు.

పుస్తక పరిచయ సభను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూన్ 8: జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో పుస్తక పరిచయ సభను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించనున్న సభకు సాహితీవేత్తలు విశేషంగా హాజరై జయప్రదం చేయాలని జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరై కవి సిద్దగిరి శ్రీనివాసులు రచించిన 'నౌళంబవాడి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.40వేలు

అనంతపురం రూరల్, జూన్ 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40వేలు, కనిష్ఠంగా రూ.16వేలు, సరాసరి రూ.26వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తంగా 760టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రియల్ ఎస్టేట్ కుదేలు



చిగిచెర్లకు వెళ్లే రహదారి పక్కన బడన్నపల్లి వద్ద వేసిన లే అవుట్

● కొత్త ప్రభుత్వంలో మంచిరోజులు వచ్చేనా...? ● జాతీయ రహదారులతో పెరిగిన ధరలు

ధర్మవరం, జూన్ 8: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలయింది. జిల్లాల ఏర్పాటుతో పుంజుకుంటుందన్న ఆశతో కోట్లాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన వారు వడ్డీలు కూడా కట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2022లో అనంతపురం జిల్లాను విభజించి కొత్తగా సత్యసాయి జిల్లాను ఏర్పాటు చేసింది. జిల్లా ఏర్పాటవుతుందని వార్తలు రావడంతో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. ఈ క్రమంలో సత్యసాయి జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ప్రాంతాల భూములకు రెక్కలొచ్చాయి. ముఖ్యంగా జగరాసుపల్లి, కప్పలబండ, మామిళ్లకుంట, జానకంపల్లితో పాటు కొత్తచెరువు మండల పరిసరాల్లో భూములు ఎకరా రూ.2కోట్ల నుంచి రూ.3కోట్లు పలికాయి. దీంతో ఆ భూముల రైతులు ఆనందపడ్డారు. ఈ ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగా ముగిసిపోయింది. జిల్లా కార్యాలయాలకే భవనాలు లేనప్పుడు జిల్లా కేంద్రాన్ని ఎక్కడ నిర్వహిస్తారోనన్న సందేహం మొదలైంది. సత్యసాయి జిల్లా ఏర్పాటుతో భూములు కొనుగోలు చేసిన వారు లాభాలు రావడంతో కొందరు వెంటనే క్రయవిక్రయాలు జరిపారు. ఇంకా కోట్లలో డబ్బు వస్తుందని ఆశపడ్డ వారికి నిరాశేఎదురైంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిదులు రియల్ఎస్టేట్ చేసేవారి నుంచి మామూళ్లు ఇవ్వాలని పట్టుపట్టడంతో వ్యాపారులు కనుమరుగయ్యారు. దీంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో రియల్ఎస్టేట్ రంగం చతికిలపడింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. సత్యసాయి జిల్లాలో ముదిగుబ్బ నుంచి కోడూరు చెక్ పోస్టు వరకు నాలుగు రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. బత్తలపల్లి నుంచి చెన్నై వరకు జాతీయ రహదారుల విస్తరణ కార్యక్రమాన్ని శ్రీకారంచుట్టింది. ఉమ్మడి జిల్లా నుంచి రాజధాని అమరావతికి జాతీయ రహదారి నిర్మాణానికి శ్రీకారంచుట్టడం, సత్యసాయిజిల్లాలోని కొత్తచెరువు మండల సమీపంలో రైల్వే జంక్షన్‌కు సర్వే నిర్వహించడంతో ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. కొత్తచెరువు మండల కేంద్రంలో ఎకరా రూ.2కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు ధరలు పలుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో కోట్లాదిరూపాయలతో భూములను కొనుగోలు చేసి, వాటిని కొనేవారు లేక పూర్తిగా నష్టపోయామని పలువురు రియల్ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ధర్మవరం సమీపంలోని పుట్టపర్తి రహదారి, చిగిచెర్ల, బత్తలపల్లి రహదారి, ఎస్ఎస్‌గేటు రహదారుల్లో కూడా భూములు కొనుగోలు చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కాబోతుండటంతో రియల్ఎస్టేట్ వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పుట్టపర్తి ప్రాంతంలో వేసిన వెంచర్

అప్పులుచేసి భూములు కొన్నా

: మల్లెల నారాయణస్వామి, ముదిగుబ్బ



వైసీపీ ప్రభుత్వ హయాంలో 10 ఎకరాలు రూ.60లక్షలతో కొనుగోలు చేశాను. భూములు కొనుగోలు చేసిన కొద్దిరోజులకే రియల్ ఎస్టేట్ కుదేలైంది. భూములు కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. భూముల కొనుగోలు చేయడానికి అప్పులు చేశా. వడ్డీలు కట్టడానికే ఇబ్బందులుపడుతున్నా. కొత్త ప్రభుత్వంలోనైనా రియల్ఎస్టేట్‌కు మంచి రోజులు వస్తే బయటపడతా.

రియల్ఎస్టేట్‌కు రిజిస్ట్రేషన్ చార్జీలు శాపం

: రమేశ్‌బాబు, రియల్ వ్యాపారి, కొత్తచెరువు



గత ప్రభుత్వాల హయాంలో రియల్ఎస్టేట్ రంగం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగేది. వైసీపీ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్‌రంగంపై ప్రజాప్రతినిధులకు మామూళ్లతో పాటు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం వల్ల భారం పడింది. ప్లాట్లు కొనుగోలు చేసేవారిపై భారం పడుతుండటంతో స్థలాలు కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు.

ఇక మంచిరోజులు వస్తాయి

: మారుతీరెడ్డి, పుట్టపర్తి



కొత్త ప్రభుత్వంలో రియల్ఎస్టేట్ వ్యాపారానికి మంచిరోజులు వస్తాయన్న నమ్మకం ఉంది. గత ప్రభుత్వంలో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేశా. ఇంతవరకు ఆ భూమి కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో భూమి కొనుగోలుకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టా. కొత్త ప్రభుత్వంలో రియల్ఎస్టేట్‌కు మంచిరోజులు వస్తాయి, మా కష్టాలు తీరుతాయి.




నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన ఓ వెంచర్

చెక్‌ధ్వ్యాం..!

ధ్వంసమైన చెక్‌డ్యాంలు...

● రాళ్లు తేలి.. ముళ్ల పొదలతో నిండిపోయాయి
● అడుగంటుతున్న భూగర్భ జలాలు...
● వైసీపీ పాలనలో మరమ్మతులు మరిచారు



శింగనమల కొండలో ధ్వంసమైన రాళ్ల చెక్‌డ్యాం

శింగనమలలో పాడైపోయిన చెక్‌డ్యామ్



శింగనమల జూన్8: భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా టీడీపీ హయాంలో నిర్మించిన చెక్‌డ్యాంలు ధ్వంసమైపోతున్నాయి. నియోజకవర్గంలో వాటర్‌షెడ్ నీటి యాజయాన్య ఆధ్వర్యంలో వీటిని నిర్మించారు. వేసవిలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో భూగర్భ జలాలు పెంపొందించి రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా డ్వామా ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. శింగనమల మండలంలో 89 చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో పాటు మండలంలోని 10 కుంటలకు రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. దీంతో వర్షాధారం కింద నీరు నిల్వ ఉండి, భూగర్భ జలాలు పెరిగి మండలంలో వందలాది ఎకరాలలో రైతులు పంటలు సాగు చేసిన సందర్భాలూ ఉన్నాయి. మూగజీవాలకు తాగునీటి సమస్య కూడా పరిష్కారమయ్యింది. బోర్లలో జలాలు పెరిగేవని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

● వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి తరువాత చెక్‌డ్యామ్‌లు, కుంటలు, చెరువుల మరమ్మతులను గాలికొదిలేశారు. వాటిలో పూడిక చేరి ముళ్లపొదలతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. చాలా చెక్‌డ్యాంలు రంధ్రాలు పడి, రాళ్లు కొట్టుకుపోవడంతో శిథిలావస్థలోకి చేరాయి. రాళ్లు ఊడిపోయి ధ్వంసమయ్యాయి. పలు చోట్ల రాళ్లు తొలగిపోయి ముళ్లపొదలు పెరిగాయి. దీంతో వర్షం వచ్చినా చుక్క నీరు నిల్వ ఉండడం లేదు. దీంతో గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయి తాగు, సాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా డ్వామా అధికారులు చెక్‌డ్యాంల మరమ్మతులపై దృష్టి సారించి భూగర్భజలాలను కాపాడాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి: నెట్టికంటి, రైతు



సీ.బండమీదపల్లి గ్రామంలో టీడీపీ హయాంలో 10 చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. అప్పట్లో వేసవికాలంలో బోర్లు ఎండిపోయినా భూగర్భజలాలు పెరిగి పొలాలు సాగు చేసేవారం. ఇప్పుడు చెక్‌డ్యాంలో చుక్క నీరూ నిలవడం లేదు. మరమ్మతులు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

వేసవిలో ఎంతో ఉపయుక్తం..



టీడీపీ హయాంలో శింగనమలలో దాదాపు 15 చెక్‌డ్యామ్‌లు రాతికట్టడాలతో పకడ్బందీగా నిర్మించారు. వర్షాకాలంలో నీరు పుష్కలంగా చేరి కళకళలాడేవి. అవే నీటిని ఎండాకాలంలో వాడుకునేవాళ్లం. వైసీపీ ప్రభుత్వంలో వాటర్‌షెడ్ పనులకు స్వస్తి పలకడంతో చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భూగర్భజలాలు తగ్గిపోయి నీటికి తిప్పలు తప్పడం లేదు.

- పెద్దనాగముని, వాటర్‌షెడ్ మాజీ డైరెక్టర్

గొర్రెలకూ నీటి కష్టాలే : కాపరి బొజ్జప్ప



కొండ ప్రాంతాల్లో నిర్మించిన చెక్‌డ్యామ్‌లతో మూగజీవాల దాహం తీరేది. ఇప్పుడు పూర్తిగా ధ్వంసం కావడంతో నీరు నిల్వ లేక గొర్రెలకు తాగునీరూ దొరకడం లేదు. ముళ్లపొదలు, ఎక్కడ చూసినా రంధ్రాలతో నీరు లీక్ అవుతోంది. వర్షాలు కురిసినా నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. కనీసం మూగ జీవాల కోసమైనా వాటికి మరమ్మతులు చేయించి నీటిని నిల్వ ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

13న చైతన్యజ్యోతి మ్యూజియం పునఃప్రారంభం



చైతన్యజ్యోతి మూజియం

పుట్టపర్తి, జూన్ 8: పట్టణంలోని సత్యసాయి సెంట్రల్ ట్రస్టుకు సంబంధించిన చైతన్య జ్యోతి మ్యూజియంను కొద్దిరోజుల క్రితం మూసేశారు. లోపలిభాగంలో పలు మరమ్మతులు చేపట్టనున్న కారణంగా మూసివేయాల్సి వచ్చిందని ట్రస్టువర్గాలు శనివారం తెలిపాయి. తిరిగి ఈనెల 13వ తేదీన పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి 11:30గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు మ్యూజియంను సందర్శించడానికి సందర్శకులను లోనికి అనుమతిస్తామని పేర్కొన్నాయి.

టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ మృతి



ఉప్పర ఈరన్న (ఫైల్)

బుక్కరాయసముద్రం, జూన్ 8: అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు వద్ద శనివారం టిప్పర్ ఢీకొని జీవిత ఖైదీ ఉప్పర ఈరన్న (50) మృతి చెందారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్న 2005లో తన భార్యను హత్య చేసిన కేసులో ముద్దాయి. కోర్టులో నేరం రుజువు కావడంతో 2007లో జీవిత ఖైదు పడింది. కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ.. సత్ప్రవర్తన కారణంగా 2016లో అనంతపురం ఓపెన్ఎయిర్ జైలుకు వచ్చాడు. జైలుకు సంబంధించి వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసేందుకు సైకిల్ మీద వెళుతుండగా వేగంగా వచ్చిన ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఈరన్న అక్కడిక్కడే మృతి చెందాడు. ఈరన్న 17 సంవత్సరాల నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. కొత్త ప్రభుత్వంలో క్షమాభిక్షపై విడుదల అవుతానని తోటి ఖైదీలతో తరుచూ అనేవాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఈరన్న మృతితో ఓపెన్ ఎయిర్ జైలులో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన ట్రిప్పర్ అనంతపురం నగరానికి చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీది అని జైలు అధికారులు తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఓపెన్ ఎయిర్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షఫివుర్ రెహమాన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ పరిశీలనకు జాంబియా బృందం

అనంతపురం అర్బన్, జూన్ 8: ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగవుతున్న పంటలను పరిశీలించేందుకు 16 మంది సభ్యులతో కూడిన జాంబియా బృందం వచ్చింది. జాంబియా దేశ వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధి సయామీస్ ముండియా, వ్యవసాయ కళాశాలకు చెందిన ఇద్దరు శిక్షణాధికారులు, కేపీటీసీ ప్రతినిధి క్లాస్ రెక్టెన్వాల్డ్‌తోపాటు మరో 11 మంది రైతులు, వాల్ఫోనాస్కా శిక్షణా క్షేత్రం(వీఎల్ఎఫ్) ప్రతినిధులు జిల్లాకు వచ్చారు. శనివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నేవేటీవ్ ఆఫీసర్ లక్ష్మానాయక్, అధికారులు, సిబ్బంది జాంబియా బృందం సభ్యులు సమావేశమయ్యారు. ఉమ్మడి అనంత జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలు, సాగు చేసే విధానం, పంటల వారిగా అయ్యే ఖర్చు తదితర వివరాలపై జాంబియా బృందం ఆరా తీసింది. సోమవారం నుంచి ఈనెల 21వతేదీ ఉమ్మడి అనంత జిల్లాలోని వివిధ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జాంబియా బృందం పరిశీలించనుంది. సోమవారం బత్తలపల్లిలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బృందం పరిశీలించనుంది. ఆ తర్వాత షెడ్యూల్ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలను పరిశీలించి, ఆయా రైతులతో ముఖాముఖిగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయంపై అధ్యయం చేయనున్నారు. జాంబియాలోని లుసాకాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా సుస్థిర ఆర్గానిక్ వ్యవసాయం చేయించి, ప్రజల జీవనోపాధులు పెంచాలన్న ఉద్దేశ్యంతో జాంబియా బృందం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు విధానంపై అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు సంబంధిత శాఖాధికారులు పేర్కొన్నారు.



జిల్లా అధికారులతో సమావేశమైన జాంబియా బృందం

పూలే, అంబేడ్కర్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూన్ 8 : మహాత్మా జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారాలకు అర్హులైన, ఔత్సాహికులైన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని రిజర్వేషన్ల ఎంప్లాయిస్ ఫెడరేషన్, మహాత్మాజ్యోతిరావు పూలే ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆయా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు నారాయణ నాయక్ మాట్లాడుతూ..... ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదవిన అన్ని కులాల మహిళా విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. 10వ తరగతిలో 450 మార్కులు, ఇంటర్‌లో 750 మార్కులు, ఆపైన సాధించిన విద్యార్థులు తమ మార్కుల జాబితా, ఆధార్‌కార్డులను వాట్సప్‌కు పంపాలన్నారు. పుల్లయ్య 9966807021, నాగభూషణం 8309475846, నారాయణనాయక్ 9494933825, ఓబులేసు 9441443923 నెంబర్లకు పంపాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాసులు, ఓబులేసు, రాజశేఖర్, శ్రీరాములు, శివయ్య, మల్లికార్జున, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘాల నాయకులు

26 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 8 : జిల్లాలోని 26 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా పెద్దవడుగూరులో 64.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అనంతపురం 29.2, కళ్యాణదుర్గం 27.2, ఆత్మకూరు 24.0 , బ్రహ్మసముద్రం 21.0, బుక్కరాయసముద్రం 19.2, కుందుర్పి 18.2, కంబదూరు 17.2, శింగనమల 17.0, రాప్తాడు 16.0 మి.మీల వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 13.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది. అలాగే శనివారం బెలుగుప్ప, గార్లదిన్నె, పామిడి మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. అనంతపురంలో చిరుజల్లులు పడ్డాయి. పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. వాగుల్లోకి నీరు చేరి పొంగిపొర్లుతున్నాయి.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైభవంగా పల్లకి సేవ



అలంకరణలో మూలవిరాట్

ఉరవకొండ, జూన్8: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం భక్తులు దాసంగాలు నిర్వహించడం ఆనవాయితీ. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.

వైసీపీ నాయకుడి అరెస్ట్

తాడిపత్రిటౌన్, జూన్8: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రామేశ్వర్‌రెడ్డిని శనివారం అరెస్ట్ చేశామని సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన రాళ్లదాడుల్లో నిందితుడిగా ఉన్న రామేశ్వర్‌రెడ్డిని కడపరోడ్డులో అరెస్ట్‌చేసి గుంతకల్లు కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. అనంతరం కడపజైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

మూడు దుకాణాల్లో చోరీ

తాడిపత్రిటౌన్, జూన్8: పట్టణంలోని పుట్లూరురోడ్డులో ఉన్న ఆయిల్‌షాపు, జనరల్‌స్టోర్, మెడికల్ స్టోర్‌లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడి రూ.50వేలు మేర చోరీ చేశారు. బాగా పొద్దుపోయాక గుర్తుతెలియని దుండగులు దుకాణాలకు ఉన్న షట్టర్లను పగలగొట్టి లోపలికి చొరబడి నగదును దోచుకెళ్లారు. శనివారం ఉదయం షాపులకు వచ్చిన యజమానులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. కానీ ఈ చోరీపై ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

ఆలూరుకోనలో ప్రత్యేక పూజలు



అలంకరణలో శ్రీదేవిభూదేవి సమేత రంగనాథస్వామి

తాడిపత్రిటౌన్, జూన్8: మండలంలోని ఆలూరుకోనలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అర్చనలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఐకమత్యంగా నడుచుకుందాం



ఈశ్వర్‌ను సన్మానిస్తున్న తెలుగు తమ్ముళ్లు

పామిడి, జూన్ 8 : గుంతకల్లు నియోజకవర్గంలో అనతికాలంలోనే ఎన్డీయే కూటమి అభ్యర్థిగా గుమ్మనూరు జయరాం పోటీ చేసి గెలిచారంటే అందుకు తెలుగు తమ్ముళ్ల సమిష్టి కృషి, ఐకమత్యమే కారణమని ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌ఆర్ రమేష్ గెస్ట్ హౌస్‌లో టీడీపీ నాయకులతో శనివారం సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం కోసం కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పలు గ్రామాల నాయకులు గుమ్మనూరు ఈశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోకు పలువురి నివాళి

పామిడి, జూన్ 8: మండలంలోని కత్రిమల గ్రామ రెవెన్యూ అధికారి అమర్‌నాథ్(39) శనివారం గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీఆర్వో అమర్‌నాథ్ మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ రెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు ప్రభాకర్‌చౌదరి, చెన్నకేశవరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు, మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి, రెవెన్యూ ఉద్యోగులు తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతన్నల సంక్షేమమే మా ధ్యేయం

- మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్

తాడిపత్రి టౌన్, జూన్ 8: రైతు సంక్షేమమే తమ ధ్యేయమని టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శనివారం సోషల్ మీడియాలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న డీలర్లు ఎవరైనా నకిలీ పత్తివిత్తనాలు విక్రయించారని తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పెద్దవడుగూరు మండలంలో రైతులు అప్రమత్తంగా ఉండి నాణ్యత కలిగిన పత్తి విత్తనాలను తీసుకోవాలన్నారు. డీలర్లు నకిలీపత్తి విత్తనాన్ని రైతులకు అంటగడితే వారే నష్ట పరిహారాన్ని చెల్లించాలన్నారు. అంతవరకు దుకాణాలు, ఇళ్లవద్ద కూర్చొంటామని హెచ్చరించారు. రేటు ఎక్కువైనా పర్వాలేదు గానీ నాణ్యత కలిగిన విత్తనాలను విక్రయించాలని కోరారు.

పుప్పాలలో16 మందిపై కేసు

యాడికి, జూన్8: మండలంలోని పుప్పాల గ్రామంలో భూ సమస్యతో గొడవపడ్డ 16మందిపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈనెల 6న పుప్పాల గ్రామంలో భూ సమస్యతో చరణ్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేసి కొట్టారని తెలిపారు. ఈ ఘటనలో చరణ్ గాయపడ్డారని తెలిపారు. చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుధాకర్, దేవేంద్ర, అశోక్, నాగేశ్వర, నాగేంద్ర, ఈశ్వర్‌రెడ్డి తదితరులతో కలిపి మొత్తం 16మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న టీడీపీ గెలుపు సంబరాలు



కళ్యాణదుర్గం ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట టెంకాయలు కొడుతున్న నాయకులు



పెన్నహోబిళం ఆలయం వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న టీడీపీ నాయకులు



101 టెంకాయలు కొట్టిన చింతలాయపల్లి గ్రామస్థులు

కళ్యాణదుర్గం, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో విజయం పట్ల టీడీపీలో సంబరాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని కోటవీధిలో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు మాట్లాడుతూ అమిలినేని సురేంద్రబాబు అఖండ మెజార్టీతో గెలుపొందడంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. బాలనరసింహ, మహేష్ రామన్న, నాగప్ప, ప్రకాష్, భాస్కర్, విజయ నిర్మలమ్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఉరవకొండ: ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలుపొందడంతో టీడీపీ నాయకులు 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు రాధాకృష్ణ ఆధ్వర్యంలో కేశవ్ పేరిట అర్చనలు, పూజలు చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, నాయకులు సూరి, నారాయణస్వామి, తులసి, ఆదిలక్ష్మి, గంగమ్మ, పాల్గొన్నారు.

యాడికి: ఎన్నికల్లో టీడీపీ విజయంపై చింతలాయపల్లి గ్రామస్థులు శనివారం సంబరాలు నిర్వహించారు. కొత్త వెంకటరమణస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టపాసులు కాల్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు బయపురెడ్డి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దుర్గంలో శుభ్రమవుతున్న వీధులు

కళ్యాణదుర్గం, జూన్ 8: నియోజకవర్గ ఎమ్మెల్యేగా అమిలినేని సురేంద్ర బాబు గెలవడంతో పట్టణంలోని ప్రధాన వీధులన్నీ పరిశుభ్రంగా మారుతున్నా యి. ఈ నేపథ్యంలో శనివారం వాల్మీకి సర్కిల్, టీ సర్కిల్, మార్కెట్ యార్డు, అనంతపురం రోడ్డుతో పాటు ప్రధాన వీధులన్నీ పరిశుభ్రంగా వుంచేందుకు మున్సిపల్ అధికారులు రోడ్డుబాట పట్టారు. రాయలసీమ జోనల్ మున్సిపాల్టీ ఇన్‌చార్జ్ మూర్తి దృష్టికి ఇక్కడున్న అపరిశుభ్రతను అమిలినేని తీసుకెళ్లారు. దీంతో పరిసరాలు శుభ్రం చేయమని ఇక్కడున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ప్రధాన వీధిలో వున్న మురుగునీరంతా శుభ్రం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా వుంచుకునేలా ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగాలని మున్సిపల్ సిబ్బందికి అమిలినేని సురేంద్రబాబు ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



మార్కెట్ యార్డులో శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గెలిపించిన నాయకులకు రుణపడి ఉంటాం



మండల కన్వీనర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రాయదుర్గం రూరల్, జూన్ 8: నియోజకవర్గం ఎమ్మెల్యేగా కాలవ శ్రీనివాసులను అత్యధిక మెజార్టీతో గెలిపించిన టీడీపీ నాయకులు కార్యకర్తలకు రుణపడి ఉంటామని మండల కన్వీనర్ హనుమంతు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో మండలంలోని పలువురు సర్పంచులు, నాయకులు మండల కన్వీనర్ హనుమంతుని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కనీనర్ మాట్లాడుతూ ఇది నిజమైన కార్యకర్తల విజయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి, టీడీపీ నాయకులు వీరేష్‌స్వామి, తిమ్మారెడ్డి, వన్నూరప్ప, వీరేష్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని ఢీకొన్న మెట్టు వాహనం

డీ.హీరేహాళ్, జూన్ 8: మండలంలోని పులకుర్తి బస్టాండ్ వద్ద వైసీపీ నాయకుడు మెట్టు గోవిందరెడ్డికి సంబంధించిన కారు ఢీ కొనడంతో నరసింహ అనే 14 ఏళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన హనుమంతు కుమారుడు నరసింహ గర్భిణి అయిన తన అక్కతో కలిసి బళ్లారికి వెళ్లేందుకు పులకుర్తి గ్రామ సమీపంలో ఉన్న బస్టాండ్‌కు వెళ్లాడు. ఈ సమయంలో అక్కడకి వచ్చిన ఆటోను ఆపి తన అక్కను తీసుకొని వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బళ్లారి వైపు నుంచి వస్తున్న కేఏ 03 ఎం జడ్ 7290 అనే నెంబర్ గల కారు ఆ బాలుడిని ఢీ కొంది. దీంతో ఆ బాలుడు గాల్లోకి లేచి అదే వాహనం టాప్‌పైకి పడి రోడ్డు అవతలకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆ బాలుడిని వాహనంలోనే ఉన్న మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి బళ్లారి విమ్స్ కు తీసుకెళ్లాడు. అయితే బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించిన టీడీపీ నాయకులు



పంప్‌హౌస్ దగ్గర పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పుట్లూరు, జూన్8: మండలంలోని 14గ్రామాలకు చిత్రావతి నది నుంచి తాగునీరు అందించే గండికోట పైప్‌లైన్‌ను శనివారం మండల టీడీపీ నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. యల్లనూరు మండలం పీఎం కొండాపురం గ్రామంలో ఉన్న పంప్‌హౌస్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయి తాగునీరు దొరక్క ఇతర గ్రామాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసుకుంటున్నామని తెలిపారు. పంప్‌హౌస్‌లోని మోటార్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీంతో రూ.12వేలు సొంత నిధులు వెచ్చించి స్టార్టర్ పెట్టెలు కొనుగోలు చేసి అధికారులకు అందించామని తెలిపారు. అనంతరం అధికారులు పద్మనాభం, లైన్‌మెన్ ఉదయ్, కాంట్రాక్టర్ జయరామిరెడ్డిలతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామచంద్రనాయుడు, వాసురెడ్డి, శ్రీనివాసులునాయుడు, జయచంద్రారెడ్డి, తిరుపతి, మధు, భాస్కర్, రామ్మోహన్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఉరవకొండ.జూన్8: వజ్రకరూరు మండలంలోని కడమలకుంటలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు డాక్టర్ ఎస్వీఎస్ చౌదరి, టీడీపీ నాయకులు ప్యారంకేశవ, భగవాన్, రెడ్డి మాసి రవీంద్ర పాల్గొన్నారు.

గొడవలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

యాడికి, జూన్8: గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం గడపాలని, గొడవల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కమలపాడు, చింతలాయపల్లి, బోయరెడ్డిపల్లి, చిక్కేపల్లి యాడికిలో శాంతి కమిటీలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హింసాత్మక ఘటనలకు పాల్పడినా, ఆస్తుల విధ్వంసానికి ప్రయత్నించినా కేసులు నమోదు చేస్తామని, రౌడీషీట్స్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

బలవంతంగా విధులకు..

విడపనకల్లు, జూన్ 8: ఆరు నెలలు వేతనాలు ఇవ్వాలని సమ్మెబాట పట్టిన సీపీడబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులను బెదిరించి వేతనాలు ఇవ్వకుండానే విధులకు వెళ్లేలా అధికారులు చేశారు. శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కార్మికులతో మాట్లాడుతూ మీరు సమ్మె విరమించక పోతే మీ స్థానంలో కొత్త వారిని నియమించి పనులు చేయించుకుంటాము అంటూ బెదిరింపులకు దిగారు. ఒక్క నెల జీతం మీ అకౌంట్లోకి సోమవారం వేయిస్తాము అన్నారు. మిగిలిన 5 నెలల వేతనాలు 15 రోజుల్లో ఇచ్చే ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ్య తెలిపారు. దీంతో కార్మికులు చేసేది లేక ఉద్యోగాలు పోతే కుటుంబాలు రోడ్డున పడతాయని, అధికారులు చెప్పిన మాటకు కట్టుబడి శనివారం మధ్యాహ్నం నుంచి విధులకు హాజరయ్యారు. 9 గ్రామాలకు నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి 21 కుటుంబాలవారు వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార్లైనా స్పందించి ఆరు నెలల వేతనాలు ఇప్పించాలని కోరారు.

విస్తారంగా వర్షాలు



మరువ పారుతున్న ముద్దలాపురం చెరువు

కూడేరు, జూన్ 8: గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో చెక్‌డ్యాంలు, కుంటలు నిండిపోయాయి. పలు చెరువుల్లో నీరు చేరింది. మే నెలలో 99.9 ఎంఎం వర్షం కురవగా, జూన్ నెలలో ఇప్పటికే దాదాపు 100 ఎంఎం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ముద్దలాపురం గ్రామ చెరువు పూర్తి నిండి మరువపారుతోంది. కరుట్లపల్లి, ఇప్పేరు, రామచంద్రపురం చెరువుల్లోకి నీరు చేరింది. గత రెండు, మూడు సంవత్సరాలుగా వర్షాలు కురవక పోవడంతో బోరు బావులల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో అన్నదాతలు సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో బోరుబావుల్లో నీరు సంవృద్ధిగా పెరుగుతుందని పలువురు రైతులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు అనుకులంగా వస్తుండటంతో పంటల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.

విడపనకల్లు మండలంలో భారీ వర్షం



భారీగా కురుస్తున్న వర్షం

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. తెల్లవారు జామున చిన్నగా తేలిక పాటి వర్షంతో మొదలైయింది. ఈ వర్షానికే మండలంలో విద్యుత్ సరఫరా ఉదయం 6గంటలకు నిలిచి పోయింది. సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరా రాలేదు. మధ్యాహ్నం భారీ వర్షం రావటంతో పంట పొలాలు మొత్తం వర్షపునీటితో నిండి చేరువులను తలపించాయి.

9.8 మిల్లీమీటర్ల వర్షపాతం

బెళుగుప్ప: మండలంలో శుక్రవారం రాత్రి 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తుండటంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. రోజు రాత్రి సమయంలో వర్షం కురుస్తుండటంతో శనివారం పగలు తేలికపాటి వర్షం కురిసింది.

గుంతకల్లుటౌన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో పట్టణంలో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మధ్యాహ్నం 1.30గంట నుంచి 4.30గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నేలకొరిగిన పెద్ద వృక్షం



బళ్లారి - కళ్యాణదుర్గం రహదారిపై అడ్డంగా పడిన చెట్టు

బొమ్మనహాళ్, జూన్ 8: మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద బళ్లారి, కళ్యాణదుర్గం అంతరాష్ట్ర రహదారిపై శనివారం ఓ భారీ వృక్షం నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. మూడురోజులుగా కురుస్తున్న గాలివానకు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆ వృక్షం నేలకొరిగింది. అయితే అప్పుడు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్దిరోజులుగా మండలంలోని భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో రావిచెట్టు వేర్లతో రోడ్డుపై పడింది. దీంతో కళ్యాణదుర్గం - బళ్లారి ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టును తొలగించే ప్రయత్నం ఎవరూ చేయకపోవడంపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వరకట్నం వేధింపులపై కేసు

డీ.హీరేహాళ్, జూన్ 8: కట్నం తీసుకువస్తేనే నీతో కాపురం చేస్తానన్న బెదిరిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన సువర్ణకు బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ గ్రామానికి చెందిన ఎం శ్రీధర్‌తో గత ఏడాది డిసెంబరులో వివాహం జరిగింది. వరకట్నంగా రూ. రెండు లక్షలు, 10 తులాల బంగారం ఇచ్చారు. అయితే గత కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం తన భర్త, అతడి కుటుంబ సభ్యులు చిత్రహింసలు పెడుతున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. సువర్ణ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

పుప్పాలలో 16మందిపై ..

యాడికి, జూన్8: మండలంలోని పుప్పాల గ్రామంలో భూతగాదాలో గొడవపడ్డ 16మందిపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఈనెల 6న పుప్పాల గ్రామంలో భూతగాదాకు సంబంధించి చరణ్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో చరణ్ గాయపడ్డారని తెలిపారు. చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుధాకర్, దేవేంద్ర, అశోక్, నాగేశ్వర, నాగేంద్ర, ఈశ్వర్‌రెడ్డి తదితరులతో కలిపి మొత్తం 16మందిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.




గుత్తిలో రామోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుమ్మనూరు నారాయణ



గుంతకల్లులో టీడీపీ నాయకుల నివాళి



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు (ఉరవకొండ)



నివాళులర్పిస్తున్న కాలవ శ్రీనివాసులు

రామోజీరావుకు ఘన నివాళి

గుత్తి, జూన్ 8: స్థానిక అర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ నాయకులు ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంకే చౌదరి, నారాయణస్వామి, లక్ష్మన్న, కరిడికొండ సూరి, కొనంకి కృష్ణ, బద్రివలి పాల్గొన్నారు.

గుంతకల్లు/టౌన్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

● అలాగే మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోడెల అపర్ణ, కోడెల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలరు లక్ష్మీనారాయణ, నాయకులు గోపాల్, జనార్దన్, రంగనాథ్ చౌదరి, రమేశ్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటం ఏర్పాటు చేసి బొల్లు శ్రీనివాసరెడ్డి, అప్పన్నగారి కుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, శ్రీనివాసులు, సుంకప్ప, శ్రీరాములు, వెంకటరాముడు తదితరులు నివాళులర్పించారు.

ఉరవకొండ: రామోజీరావు మృతి సమాజానికి తీరని లోటని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సినీ, మీడియా రంగంలో ఎంతో మందికి ఆయన ఆదర్శం అన్నారు.

● ఉరవకొండ టీడీపీ కార్యాలయంలో దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు తదితరులు రామోజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు.

పెద్దవడుగూరు: మండలంలోని కొండూరు గ్రామంలో శనివారం ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి మండల టీడీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కొండూరు కేశవరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, త్రివేదినాయుడు, రామలింగ స్వామి, శివ, డ్రైవర్ మల్లికార్జున, వన్నూరు స్వామి తదితరులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళ్యాణదుర్గంరూరల్: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కార్యాలయంలో టీడీపీ నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళ్యాణదుర్గం: కంబదూరు టీడీపీ కార్యాలయలో రామోజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పార్టీ నాయకులు రామ్మోహన్ చౌదరి, ఆవుల తిప్పేస్వామి నివాళులర్పించారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయం, అన్ని విలువల బడుల్లోను ఈనాడు అధినేత రామోజీరావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ వద్ద రామోజీరావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. బలరాంరెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, ఎర్రగుంట్ల వెంకటేశులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రజా సంఘం నాయకులైన నాగరాజు, నాగార్జున, ఆప్ నాయకుడు వెంకటరమణబాబు, సీఐటీయూ నాయకుడు మల్లికార్జునల ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కణేకల్లు: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల స్థానిక టీడీపీ నాయకులతో పాటు ఏపీయూడబ్ల్యూజే కమిటీ వేర్వేరుగా తమ సంతాపాన్ని వ్యక్తం చేశా రు. టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, షేక్ ముజ్జు, బీటీ రమేష్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు గోవర్ధన్, శోభన్‌బాబు, ఫక్రుద్దీన్, బాషా, హాజీపీర, సీలం, మధు తదితరులు ఆయనకు నివాళు లర్పించారు.

డీ.హీరేహాళ్: స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు నాగిళ్లి రాజు, హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావుకు నివాళులర్పించారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని గాంధీసర్కిల్‌లో శనివారం ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి పాత్రికేయులు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.



ఉప్పరహాళ్ క్రాస్‌లో రామోజీరావుకు నివాళులు



కణేకల్లులో రామోజీరావు మృతికి సంతాపం తెలుపుతున్న టీడీపీ నాయకులు



కంబదూరులో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామ్మోహన్‌చౌదరి



తాడిపత్రిలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న విలేకరులు